

# కథా కౌముది

## కస్తూరి తిలకం లలాట ఫలకే! - టి.ఎస్సార్. వెంకటేశ్వర్లు

"తిరుపతి పెళ్ళి కొండమీద శ్రీనివాసునికి కళ్యాణం చేసుకుంటామని మొక్కుకున్న సంగతి మర్చిపోయారా?" అని ఒకరోజున మా ఆవిడ సుజాత గుర్తుచేయగా ఇంటర్నెట్లో వెదికి నెల రోజుల తర్వాత దొరికిన కళ్యాణం టిక్కట్టు క్రెడిట్ కార్డు మీద బుక్ చేశాను. రైల్లో బెర్తులు బుక్ చేసాను.

నెల రోజులు ఇట్టే గడచిపోయాయి. తిరుపతి వెళ్ళవలసిన రోజు రానే వచ్చింది. నేను, సుజాత కలసి బయలుదేరాం.

స్టేషనులో దిగగానే నాకు తెలిసున్నాయన ద్వారా ముందే బుక్ చేసిన కారు రెడీగా ఉంది. ఆ కారులో తిరుమల కొండకెళ్ళాం.

భోజనాలు చేసేసరికి రాత్రి పదిగంటలయింది. బుక్ చేసిన రూములో పడుకున్నాం.

మర్నాడు ప్రొద్దున్న పది గంటలకు కళ్యాణ మండపానికి కాస్త దూరమైనా కారులో సుజాతతో బయలుదేరాను. కానీ ట్రాఫిక్ నిబంధనలవల్ల ఆ కారు వాడు మమ్మల్ని కిలోమీటరు దూరంలో దించేసాడు. కళ్యాణ మండపం వెదుక్కుంటూ నడిచి వెళుతుంటే ఒక పొట్టిలాగువాడు గళ్ళచొక్కా తొడుక్కుని, నామం పెట్టుకుని, చేతిలో తిలకం, ఓ పుల్ల ఉన్న చిన్నడబ్బా పట్టుకుని ఎదురొచ్చి,

"సార్! కళ్యాణానికి వెళుతున్నారా? మీ నుదురుకి తిలకం దిద్దుతాను. ఆగండి! ఒక్క నిమిషం. మీకు తిలకం చాలా అందంగా ఉంటుంది. ఇది కస్తూరి తిలకం సర్!" అన్నాడు.

'ఇప్పుడు వీడు ఆ పుల్లతో నా మొహం మీద ఓ గీత గీసి పాతికో, ముప్పయ్యో గుంజుతాడు. శుద్ధ దండగ. ఈ కొండ మీద అంతా వ్యాపారమే!' అని మనస్సులో తిట్టుకుని "వద్దులేవయ్యా!" అని విసుగ్గా మొహం పెట్టి వాడిని దాటుకుంటూ ముందుకెళ్ళిపోయాను.

"సార్! తిలకం ఫ్రీగానే పెడతాను. డబ్బులొద్దు సార్! రండి" అని అరిచాడు.

అది విని సుజాతతో "ఇక్కడే ఉండని" చెప్పి వెనక్కి తిరిగి వెళ్ళి వాడిచేత తిలకం దిద్దించుకున్నాను.

సుజాత నన్ను చూసి, "విశాలమైన మీ నుదురుకి దిద్దిన తిలకం చాలా బాగుందండీ! చాలా అందంగా ఉన్నారు మీరు" అంది.

ఆమె వైపుకి గర్వంగా, సంతోషంగా చూస్తుంటే, "పాతికో పరకో అతని చేతిలో పెట్టకపోయారా!" అంది.

"లేదే! వాడేమీ వద్దన్నాడు" చెప్పాను.

అది నిజమే అయినా ఎందుకో మనస్సు చివుక్కుమని అబద్ధమాడుతున్నట్లనిపించింది.

కళ్యాణ మండపానికి చేరుకున్నాం. అర్చకులు మా చేత గోత్రనామాలు చెప్పించారు. మండపంలో అందరితో పాటు కూర్చున్నాం. అక్కడంతా భక్తులతో కిటకిటలాడిపోతోంది. ఎదురుగా ఒక ప్రక్క హస్తములందు శంఖచక్రాలు, లలాట ఫలకముందు కస్తూరీ తిలకం,

మెడలో వైజయంతి మాల, పీతాంబరం ధరించి ఉన్న స్వామికి, రెండవ ప్రక్క అలంకరణతో ఉన్న శ్రీదేవి, భూదేవిలకు నమస్కరించాను. మంగళ వాయిద్యాలు శ్రావ్యంగా మ్రోగుతున్నాయి. వాఖ్యాత కళ్యాణం ప్రాముఖ్యత, ఫలితం గురించి చెపుతూ అందరిచేత గోవిందనామాలు చెప్పిస్తున్నారు. నేను కూడా కళ్ళు మూసుకుని గోవిందనామాలు గట్టిగా పలుకుతున్నాను. కళ్యాణం ప్రారంభమయి ముందుకు సాగుతోంది.

మనస్సులో నాకోరికలు చెప్పుకున్నాను. ఆ సమయంలో ఉన్నట్లుండి మెల్లగా ఎవరో "భక్తా" అని పిలిచి, "గోవింద నామాలు బాగానే పలుకుతున్నావు. కోరికలు బాగానే పలుకుతున్నావు. కోరికలు బాగానే కోరుతున్నావు. స్వామికేమైనా చేసావా మరి?" అనడుగుతున్నాడు.

'స్వామికేమిచేసానో ఈయనికేం తెలుసు? నెలరోజులు ముందుగానే వెయ్యిరూపాయలిచ్చి కళ్యాణం బుక్ చేసాను. స్లీపరు క్లాసులో రైలు బెర్తులు దొరక్కపోతే ఖర్చైనా ఎ.సి.లో బుక్ చేసాను. ఖర్చుకి లోభించకుండా ఆఖరికి కొండ మీదిక్కూడా ఎ.సి కారులో వచ్చి ఇక్కడ మామూలు రూము దొరక్క ఎ.సి. రూములో ఉంటున్నాను. ఈ ప్రొద్దుటే పుష్కరిణిలో స్నానం చేసి పట్టుబట్టలు కట్టుకుని రూములో ఉన్న స్వామి పటం ముందు నుంచుని కస్తూరీ తిలకం లలాట ఫలకే! అంటూ భక్తి శ్లోకాలు చదువుకున్నాను. కళ్యాణమయ్యాక ఐదువేలు హుండీలో వేస్తాను' అని మనస్సులో అనుకున్నది ఎలా విన్నాడో ఆయన మళ్ళీ అంటున్నాడు,

"బాగుందయ్యా! ఎంతో దూరం నుంచి కష్టపడి ఎంతో ఖర్చుపెట్టి ఈ కొండకు స్వామికళ్యానికి, దర్శనానికి వచ్చి హుండీలో డబ్బులేసి మ్రొక్కులు తీర్చుకుంటున్నావు. నీ కోరికలు తీరడానికే కదా! కానీ నువ్వనుకున్నట్లు ఆ తిలకం పెట్టేవాడు గుంజే డబ్బులుకి ప్రతిఫలం ఓ తిలకం గీత తప్ప ఏమీ ఉండదని లోభించావు. పోనీ ఊరుకున్నావా? డబ్బులొద్దంటే వెళ్ళి తిలకం పెట్టించుకున్నావు వాడిచేత. వ్యాపారం చేస్తున్నది వాడా? నువ్వా? నువ్వే కదూ! నీ నుంచేమీ ఆశించక నీకు తిలకం వాడే, నీకంటే స్వామికి ఇష్టమయ్యా! అవును! మీ ఆవిడన్నట్లు నీ నుదురు విశాలమే గానీ నీ మనస్సు మాత్రం ఇరుకయ్యా! నీకు తెలియనిది ఒకటి చెప్పనా? ఇప్పుడు నువ్వు లోభంతో ఉన్నావు. దాన్ని వదుల్చుకో. అంతేకాదు. మిగతా అరిషడ్వర్గాల్ని కూడా వదుల్చుకో. శుద్ధుడవుము. స్వామికి నిజమైన భక్తుడవుము. అప్పుడు భక్తితో స్వామికి ఒక పత్రం, పుష్పం, ఫలం ఏదో ఒకటి ఇవ్వు. లేదా కాసిని నీళ్ళైనా వదులు. స్వామి తీసుకుంటాడు. నీ క్షేమ సమాచారాలు చూస్తాడు. నీ పాపాలు పోగొట్టుతాడు".

ఇంక తర్వాత ఆయన మాటలు ఆగిపోయాయి. కళ్యాణం అయ్యాక దర్శనం, హుండీలో డబ్బులెయ్యడం పూర్తయ్యాయి.

సాయంకాలం కొండ దిగి రాత్రి బండికి బయలుదేరాము. రైల్లో రాత్రి నిద్రపట్టలేదు. నాలో అపరాధభావం బాధిస్తోంది. తిలకం దిద్దినకుర్రాడు గుర్తువస్తూనే ఉన్నాడు. నన్ను గెలిచినట్లు నవ్వుతూ పొట్టిలాగుతో నా ముందు తిరుగుతూనే ఉన్నాడు. తెల్లారయింది. మేము దిగవలసిన స్టేషను రావడానికి ఇంకా రెండు గంటలు పడుతుంది. కాఫీవాడు వచ్చాడు. నేను, సుజాత కాఫీ త్రాగుతున్నాం.

"ఏమిటలా ఉన్నారు? నిద్రపట్టలేదా? డల్ గా ఉన్నారు. ఎందుకో బాధపడుతున్నట్లనిపిస్తోంది" అంది సుజాత.

"అవును నిజంగానే బాధపడుతున్నాను. కొండమీద నాకు తిలకం పెట్టాడు చూడు. వాడే గుర్తుకొస్తున్నాడు. నువ్వు 'వాడికి పాతికో పరకో చేతిలో పెట్టకపోయారా' అన్నావు. వాడు వద్దన్నాడని చెప్పాను. అది నిజమే! అయినా అబద్ధం చెప్పాననిపిస్తోంది సుజాతా!" అంటూ జరిగింది చెప్పాను.

నే చెప్పింది విని, "ఈ మధ్య ఒక మాస పత్రికలో చదివాను. ఒకప్పుడు మన బుద్ధి సంకుచితమై అందువల్ల జరిగే చిన్న సంఘటనలు కూడా మనలో రాపిడి కలిగించి నిప్పు పుట్టిస్తాయిట. ఆ నిప్పే పశ్చాత్తాపం. ఆ నిప్పులో మన తప్పులు, పొరపాట్లు కాలిపోయి మనలో మార్పు రావడం ప్రారంభమవుతుందిట. ఇప్పుడు మీలో అదే జరుగుతోంది" చెప్పింది సుజాత.

ఆ మాటలు విన్న నాకు సుజాత ఆ సమయంలో భార్యలా కాకుండగా ఒక గురువులా అనిపించింది. తన చేతిని నా చేతిలోకి ప్రేమగా తీసుకున్నాను. సీటు వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాను. మనస్సు నిర్మలంగా ఉంది. బయట నుంచి రైల్లోకి వస్తున్న గాలి చల్లగా శరీరానికి తగులుతోంది. రైలు వేగంగా పరుగిడుతోంది.

Click here to share your comments on this story